- తెలుగు భాషాభివృద్ధి వ్యూహంగా అనువాదం
- జంజాటం (బందారం కథలు)
- భక్తి రస పోషణ - పోతన గారి పోషణ
- పల్లెపదానికి పట్టాభిషేకం
- ప్రాచీన సాహిత్యంలో దేవదాసీలు
- నల్లగొండ జిల్లా - తెలంగాణ సాయుధ పోరాటం - సాహిత్యం
- తెలంగాణ దళిత వాగ్గేయకారుడు గూడ అంజన్న విప్లవ దృక్పథం
- గిరిజన కథా సాహిత్యంలో సమాజ ఆవిష్కరణ


# మూసీ

# MUSI


• Samputi : 25 • Sanchika : 05 • Pages : 64 • Rs. 20

• March 2022

మూసీ 25 వసంతాలు

UGC Care List Approved Journals






వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**
సంపుటి : 25 సంచిక : 5
మార్చి - 2022
'ప్లవ' ఫాల్గుణ మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
B. Anantha Laxmi
***Type Setting at :***
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

తెలుగు భాషాభివృద్ధి వ్యూహంగా అనువాదం ... డా. బాణాల భుజంగరెడ్డి 7
జంజాటం (బందారం కథలు-4) ... డా. నందిని సిధారెడ్డి 11
అనుముల కృష్ణమూర్తి పద్యఖండిక 'నా మనసాయెనే' అర్థశిల్ప రామణీయకత ... డా. గంగ్ర లక్ష్మణ రావు 15
భక్తి రస పోషణ - పోతన గారి పోహణ ... టి. శ్రీవల్లీ రాధిక 19
పల్లెపదానికి పట్టాభిషేకం ... నాగభూషణం పరికె 25
పద్య మనోహరం - 28 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 28
ప్రాచీన సాహిత్యంలో దేవదాసీలు ... డా. శిరీష ఈడ్పుగంటి 29
గ్రంథాంతరంగం 10 - స్వారోచిష మనుచరిత్ర టీకా తాత్పర్య వ్యాఖ్య ... ఘట్టమరాజు 35
వ్యాస రచయితగా 'కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి' ... ఆర్. గోపాల్ 38
నడిచే పద్యంతో అంతేవాసం ... ఏ. మారుతి 41
నల్లగొండ జిల్లా - తెలంగాణ సాయుధ పోరాటం - సాహిత్యం ... కొండ విజయకుమార్ 43
తెలంగాణ దళిత వాగ్గేయకారుడు గూడ అంజన్న విప్లవ దృక్పథం ... సంగి సంజీవ్‌కుమార్ 47
వాసిరెడ్డి సీతాదేవి నవలలు - జీవన చిత్రాలు ... ఎం. రాజ్‌కుమార్ 50
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 21 ... టి. లక్ష్మీనారాయణ 53
గిరిజన కథా సాహిత్యంలో సమాజ ఆవిష్కరణ ... ధనావత్ పద్మ 56

### కవితలు

మహా శివరాత్రి ... డా. అయాచితం నటేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6, వాగ్దేవతా!!... అవుసుల భానుప్రకాశ్ - 18; వస్త్రాస్త్రం ... సాహిత్యమణి - 18; స్వర సువర్ణలత ... గురిజాల రామశేషయ్య - 62; తేనెలో మునిగి తేలిన తెలుగు ... డా. గన్నోజు శ్రీనివాసాచారి - 62.

### సమీక్షలు

ముఖాముఖి అను స్తుతి విలాసము ... డా. శ్రీరంగస్వామి 58
అసామాన్యుడికి అక్షరార్చన -2 ... డా. అట్టెం దత్తయ్య 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 5 (29) హైదరాబాద్ మార్చి : 2022

కథ

# ప్రాచీన తెలుగు సాహిత్యంలో దేవదాసీలు

**డా. శిరీష ఈడ్పుగంటి,** చిత్తూరు. ఫోన్ : 81215 23835

ప్రాచీన తెలుగుసాహిత్యంలో కనిపించే దేవదాసీలను గూర్చి తెలుసుకోవాలంటే ముందుగా దేవదాసీవ్యవస్థను గూర్చి, దేవదాసీలను గూర్చి తెలుసుకోవాలి. దేవదాసీలు అంటే ఎవరు? ఈ వ్యవస్థ ఎలా ఏర్పడింది? ఎప్పట్నించి ఈ వ్యవస్థ ఉంది... మొదలైన విషయాలను అధ్యయనం చేయాలి. తెలుగుసాహిత్యం ప్రారంభం కావడానికి ముందు ఈ వ్యవస్థ ఎలా ఉంది అనే అంశాలను కూడా చర్చించుకోవాలి.

ఈ వ్యాసంలో దేవదాసీవ్యవస్థను రెండు దశలలో వివరించడ మైనది. మొదటిదశ తెలుగుసాహిత్యం ప్రారంభానికి ముందుదశ (11వ శతాబ్దానికి ముందు). రెండవదశ తెలుగుసాహిత్యం ప్రారంభమైన తర్వాత దశ (11వ శతాబ్దానికి తరువాత). ఈ రెండు దశలలోను దేవదాసీవ్యవస్థలో వచ్చిన మార్పులను చర్చించడం, అలాగే ప్రాచీన తెలుగుసాహిత్యంలో దేవదాసీల ప్రస్తావనను పరిశీలించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

**బౌద్ధమతం**

మొట్టమొదట ఈ వ్యవస్థకు బీజం బౌద్ధమతంలో కనిపిస్తుంది. బౌద్ధసాహిత్యం పరిశీలిస్తే ప్రాచీన కాలంలో బానిసత్వం కనిపిస్తుంది. బానిసను తెలియజేయడానికి ఆ కాలంలో దాసి అనేపదం ఉపయోగించేవారు. యజమానుల అవసరాలన్నింటికి ఉపయోగపడేవారు దాసులు, దాసీలు. అల్లూరుశాసనంలో బౌద్ధగుహాలయాలకు దానం చేయబడిన వస్తువులలో దాసదాసీల ప్రసక్తి ఉంది. బౌద్ధసన్యాసులకు దానం చేయబడిన వాటిల్లో రాగిపాత్రలు, పశువులు, మరికొన్ని వస్తువులతో పాటుగా, కొంతమంది స్త్రీలు కూడా ఉండేవారు. ముగ్గురు లేదా నలుగురు స్త్రీలను దాసీలుగా దానం పొందేవారు. దానం పొందినవారికి సమస్త పనులు ఈ దాసీలు చేసేవారు. కాలక్రమేణా కొంతమంది బౌద్ధసన్యాసులు ఈ దాసీలను లైంగిక సంబంధ విషయాలలో కూడా వాడుకోదగిన స్త్రీలుగా వీరిని చూడడం జరిగింది. బౌద్ధసన్యాసులు చనిపోయిన తర్వాత వారికి కట్టించిన స్థూపం ఒకగదిలోఉంటే మరొకగదిలో భజన, చనిపోయినవారిని తలచుకుని మౌనం పాటించడం మొదలైన కార్యక్రమాలు జరిగేవి. వీటన్నింటిని దాసీలు నిర్వహించేవారు. ఈ విధంగా బౌద్ధారామాలు ఉండేవి.

**వైదికమతం**

ఇదేవిధంగా వైదికమతంలో కూడా గుళ్ళుగోపురాలు నిర్మించి, అందులో విగ్రహాలను పూజించుట ప్రారంభించారు. వైదికమతంలో మొట్టమొదట విగ్రహారాధన లేదు. కాలక్రమేణా వైదికమతం కొన్ని విషయాలలో బౌద్ధమతాన్ని అనుసరించినట్లు తెలుస్తుంది. వాటిల్లో విగ్రహారాధన, దేవాలయ నిర్మాణం, ఆలయాల్లోని కార్యక్రమాలు నిర్వహించుటకు మనుషుల ఆవశ్యకత మొదలైనవి. ఆలయ కార్యక్రమాలు అనగా విగ్రహాలను అలంకరించడం, ప్రసాదాలు తయారుచేయించడం నైవేద్యాలు పెట్టడం, పూజా మంత్రాలు, శ్లోకాలు చదవడం,



అర్చనలు చేయడం, నాట్యం చేయడం, పాటలు పాడటం, భజన చేయడం, ఆలయ ప్రాంగణం శుభ్రంచేయడం మొదలైనవి. వీటిని స్త్రీ పురుషులు ఇద్దరూ చేసేవారు. పూజాకార్యక్రమాలు చేసేవారిని పూజారులు అని, ఆలయాల్ని శుభ్రంచేసే పురుషులను మానులు అని, స్త్రీలను దాసీలని పిలిచేవారు. వీరు దేవుళ్ళకు దాసీలు కాబట్టి వీరిని దేవదాసీలు అని పిలిచేవారు. ఋగ్వేదకాలంలో స్త్రీలు ఇళ్ళల్లో పూజాసమయంలో మంత్రాలు, శ్లోకాలు చదవడం, పాటలు పాడటం చేసేవారు. స్త్రీలు చిత్తశుద్ధితో చేస్తారు, కాలనియమాన్ని బాగా పాటిస్తారనే నమ్మకం ఆరోజుల్లోనే ఉండేది. అందుకనే ఇటువంటి పనులన్నీ కూడా స్త్రీలే చేసేవారు.

**ఉపనిషత్తులు**

భారతదేశంలో ఉపనిషత్తులకాలంలోనే దాసీత్వం అనేది కనబడుతుంది. ఇందుకు ఉదాహరణగా 'సత్యకామజాబాలి' కథను చెప్పుకోవచ్చు. జాబాలి అనే స్త్రీకి కొడుకు పుడతాడు. అతనికి సత్యకామ అనిపేరు పెడుతుంది. అతని విద్యాభ్యాస సమయంలో గురువు

అతని గోత్రం అడుగుతాడు. దానికి ఆమె తన పేరు, కొడుకు పేరు కలిపి సత్యకామజాబాలి అని గోత్రాన్ని చెబుతుంది. ఎందుకంటే ఆమెకు తన కొడుకు ఎవరి వలన పుట్టింది తెలియదు. ఆమె చాలామంది దగ్గర దాసీగా పనిచేసింది. వారందరు ఆమెను లైంగిక పరమైన విషయాలలో వాడుకున్నారు. అందుచే ఆమె గర్భవతి అయి పుత్రునికి జన్మనిచ్చింది.

క్రీ.శ. 8వ శతాబ్దం నుండి శాసనాలలో దేవదాసీలకు సంబంధించిన వివరాలున్నాయి. అంతేగాకుండా శాసనాలలో సానులు, మానులు అనేపదాలు కనిపిస్తాయి. దేవాలయాలకు దానం చేయబడిన ఆడదాసీలను సానులు అని, మగదాసీలను మానులు అని పిలిచేవారు. అంటే ఒకప్పుడు దేవాలయాలకు ఆడవాళ్ళతో పాటుగా మగవాళ్ళని కూడా దానం చేసేవారు. దీనినిబట్టి ఆ రోజులలో మగదాసీలు కూడా ఉండేవారని తెలుస్తుంది. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో దేవదాసీలను గణికలు, వేశ్యలు అని పేర్కొన్నాడు. మధ్యయుగానికి ముందునుంచి దేవదాసీలు ఉన్నప్పటికి ఒక వ్యవస్థగా ఏర్పడింది మాత్రం ఈయుగంలోనే. ఎందుకంటే ఈయుగం లోనే దేవాలయాల అభివృద్ధి విస్తృతంగా జరిగింది. అంతేగాకుండా ఆరోజులలో దేవదాసీలు లేని ఆలయం ఉండేది కాదు. ఆ సమయంలోనే దేవదాసీలంతా కలిసి ఒక కులంగాను లేదా వ్యవస్థగా రూపొందించబడ్డారు. దేవదాసీ విధానం ఒక వ్యవస్థగా రూపొందిన తర్వాత దీనికి మరింత ప్రాధాన్యం పెరిగింది. ఒక అమ్మాయి దేవదాసీ కావాలంటే కొన్ని అర్హతలు కలిగిఉండాలి. నేటికాలంలో యువతీయువకులు ఉద్యోగాలకోసం అప్లై చేస్తున్నట్లుగా ఆరోజులలో అమ్మాయిలు దేవదాసీలుగా మారడానికి దరఖాస్తు పెట్టుకునేవారు. తదనంతరం సంగీతం, నాట్యం మొదలైన కళలలో ఆరు నెలలపాటు శిక్షణ తీసుకునేవారు. రాజ్యాధికారులచే రికమెండేషన్ చేయించుకునే వారు. ఈవిధంగా ఆరోజులలో అమ్మాయిలు ఎన్నో ప్రయత్నాలు చేసి దేవదాసీలుగా మారేవారు. దీనినిబట్టి మొదట్లో దేవదాసీ వ్యవస్థకు ఎంతటి ప్రాధాన్యముండేదో తెలుస్తుంది. ఇదంతా తెలుగు సాహిత్యం ప్రారంభానికి ముందు దశ.

**తెలుగు సాహిత్యం ప్రారంభమైన తరువాత దశ**

తెలుగుసాహిత్యం ప్రారంభమయ్యే నాటికి (11వ శతాబ్దానికి) దేవదాసీలలో చాలామార్పులు వచ్చాయి. దేవదాసీలు ధనికులతోనూ, రాజులతోనూ సంబంధాలు పెట్టుకోవడం మొదలుపెట్టారు. ఆరోజులలో ధనికులు, రాజులు దేవాలయాలలో పవిత్రంగా ఉండే దేవదాసీలతో సంబంధం పెట్టుకోవడం ఒక హోదాగా భావించేవారు. అదే రానురాను ఒక సాంఘిక హోదాగా పరిణమించింది. దేవదాసీలు సంగీతం నృత్యంలో ప్రవీణులు కనుక ఇటువంటి వారిని ఆధీనంలో ఉంచుకోవడం ఆనాటి సంపన్నులకు అలవాటుగా మారింది. సంపన్నుల భార్యలకు మాత్రం ఈ విషయం తెలిసిన కొంతమంది భర్తలను ఎదిరించలేక, మరికొంతమంది భర్తల పురుష లక్షణానికి గుర్తు అని ఊరుకుండిపోయేవారు. క్రీ.శ. 13వ శతాబ్ది నాటికి ఇది విపరీతమైంది. దీంతో సంగీతం నృత్యం మొదలైన కళలు తెలిసినవారు చెడిపోతారనే అభిప్రాయం సంఘంలో ఏర్పడింది.

తెలుగు సాహిత్యంలో దేవదాసీల పేరుతో ప్రస్తావన చాలా తక్కువగా కనబడుతుంది. ముఖ్యంగా ప్రాచీన సాహిత్యంలో దేవదాసీ అనేపదం కనబడదు. కానీ దేవదాసీ విధులు నిర్వర్తించిన దాసీజనం మాత్రం కనిపిస్తారు. ఈ దాసీజనమే ప్రాచీనకావ్యాలలో వేశ్య, సాని, వారకాంత, ఆటవెలది, భోగంవాళ్ళుగా పిలువబడుతున్నారు. అయితే వీరంతా దేవదాసీలేనా? దేవదాసీల కుటుంబాల నుంచి వచ్చినవారా? లేదా దేవదాసీలు, వేశ్యలు ఇద్దరు ఒక్కటేనా వేర్వేరా? అనే అంశాలను పరిశీలించాలి. అలాగే ప్రాచీనసాహిత్యంలో వేశ్య, సాని ఈ పదాలు ఏవిధంగా ఉపయోగించబడ్డాయో తెలుసుకోవాలి.

**సాని**

శాసనాలలో సానులను గూర్చిన వివరాలు గమనిస్తే **'జాయప నాయకుని చేబ్రోలు శాసనంలో చిన్నవయసులోనే అమ్మాయిలను దేవాలయాలకు దానం చేసి వారికి నట్టువుల చేత సంగీత నృత్యకళలో శిక్షణ ఇప్పించినట్లు'** , అలాగే 'పన్నెండవ శతాబ్దానికి చెందిన ఒక శాసనంలో మండరాజు సేనాని అయిన కాపయనాయకుడు దూంబరుత భీమేశ్వరునికి వంద పుట్ల భూమిని దానం చేశాడు. అందులో మసనాసాని, కాపసాని, బ్రహ్మసాని, బల్లసాని, ఎరియసాని మొదలైన సానులకు భూమిని పంచాడు. మధ్యయుగంలో మాదాలచి అనే సానికి జలసింగదేవుని సన్నిధిలో మెట్టధాన్యం పండే భూమిని దానం చేసినట్లుగా **'ఎన్. రామగోపాలరెడ్డిగారి *ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ*'** అనే సిద్ధాంత వ్యాసం ద్వారా తెలుస్తుంది.

'సాని శబ్దం సాహిణి, స్వామినీ అనే రెండు శబ్దాల నుండి వచ్చింది. ఎక్కువ ఇళ్లపేర్లలో కనిపించే సాని శబ్దం 'సాహిణి' – శబ్దం నుండి వచ్చింది. అల్లసాని వంటి పేర్లలో కనిపించేది ఇదే. పెద్దనగారి పూర్వులు సాహిణీ మారమంత్రులుగా పనిచేశారు. అందుకే ఇంటిపేరులోని సాని (సాహిణి శబ్దభవం) చేరింది. ఇక లక్కమసాని, దొరసాని వంటి స్త్రీవాచక శబ్దాలలో కనిపించే సానిశబ్దం స్వామినీ – శబ్దభవం. ఇది యజమానురాలనే అర్థంలో వచ్చింది. దొరభార్యను దొరసాని అనో, దొరసానమ్మ అనో పనిపాటలు చేసుకునే వాళ్ళు పిలవడం మనం చూసేదే. కాలక్రమంలో ఆ స్వామిని ఆధీనంతో పెట్టుకున్న వేశ్యకు సాని–శబ్దం పర్యాయపదమైంది. ఇది కాలంలో జరిగిన అర్థవిపరిణామం' అని ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుగారు ***ప్రాచీన సాహిత్య సమాలోచన*** అనే రచన ముందుమాట (అభినందన) లో ప్రస్తావించారు. మధ్యయుగంలో సాని అనేపదం అన్ని కులాల స్త్రీలకు ఉపయోగించేవారు. తదనంతరం కూడా చాలా కులాలలో

సాని అనే పదం చేరింది. ఉదా. రెడ్డిసాని, కాపుసాని. సాని అంటే స్వామిని అని గౌరవప్రదంగా గుర్తించారు.

అయితే దేవాలయ శాసనాలలో పవిత్రంగా కనిపించిన సాని అనే పదం తెలుగుసాహిత్యంలో అంత పవిత్రంగా చూపబడలేదు. దీనికి గలకారణం శాసనాలలో దేవదాసీ వ్యవస్థ ఎనిమిది, తొమ్మిది శతాబ్దాల నుండి ఉన్నది. ఆలయాల్లో దీపధూపాది సేవలతో, పాలనా వ్యవహారాల నిర్వహణలో దాతల దాన వివరాల కొనసాగింపుతో ఆలయంలోని దేవుని తరువాత దేవత వలె కనిపించారు దేవదాసీలు. క్రీ.శ.12,13 శతాబ్దాల నాటికి దేవాలయాలలోని దేవదాసీలు దేవాలయం వెలుపల వ్యక్తులతో లైంగిక సంబంధాలు పెట్టుకున్నారు. వీరి వృత్తిలో అపశ్రుతి కనిపించింది. వీరికి సంపాదన పెరిగింది. సంతానవతులు అయ్యారు. ఈ మార్పులు దేవదాసీ వ్యవస్థలో రాకూడనివి. కాలాన్ని అనుసరించి ఇలాంటి మార్పులు దేవదాసీ వ్యవస్థలో వచ్చాయి. ఈ సందర్భంలోనే సాని అనే పదానికి ఉన్న గౌరవం తగ్గుతూ వచ్చింది. దేవదాసీ వ్యవస్థలో ఇలాంటి మార్పులు వస్తున్న సమయంలో తెలుగుసాహిత్యం ప్రారంభమైంది. తెలుగు సాహిత్యం ప్రారంభ సమయానికే వీళ్ళు నీతిమాలినవాళ్ళుగా భావించబడ్డారు. ఈ అర్థంలోనే సాని అనేపదాన్ని తెలుగుసాహిత్యంలో ఉపయోగించారు. దీనినిబట్టి మధ్యయుగంలోని సాని అనే మాటకు ఉన్న ప్రాముఖ్యత తెలుగు కావ్యాలలో ఉపయోగించిన సాని అనే మాటకు లేదని తెలుస్తుంది. దీనికి కారణం దేవదాసీ వ్యవస్థలో వచ్చిన మార్పులు అని చెప్పవచ్చు.

**వేశ్య**

వేశ్య అనేపదాన్ని మొదట్లో **'దేవాలయానికి సమర్పించబడిన అమ్మాయి'** అనే అర్థంలో వాడేవారు. వేశ్య అంటే సమర్పించబడిన అమ్మాయి అని అర్థం. దేవాలయానికి సమర్పించబడిన అమ్మాయిని దేవవేశ్య లేదా దేవదాసీ అని పిలిచేవారు. అంతటి పవిత్రార్థం వేశ్య అనేపదానికి మొదట్లో ఉండేది. కాలక్రమేణా దేవదాసీలలో వచ్చిన మార్పుల ఫలితమే వేశ్య పదాన్ని నిందార్థంలో వాడుతున్నారు. అంతేగాకుండా ప్రాచీనకావ్యాలలోనూ, ప్రబంధాలలోనూ వేశ్యావర్ణనలు అనేకం ఉన్నాయి శైవసాహిత్యంలో వేశ్యలు కనిపిస్తారు. ఈ వేశ్యలలో మొదట దేవదాసీలుగా ఉండి ఆ తర్వాత వేశ్యలు లేదా వారకాంతలుగా మారినవారు ఉండవచ్చు.

*బసవపురాణం*లో ముగ్ధసంగయ్య కథలో బసవేశ్వరుడు ఎవరు ఏదీ కోరితే అది ఇస్తాడు కామసుఖాపేక్షితులైన శివభక్తులు స్త్రీలను కోరినా వారికిచ్చేవారు పైగా వారికి..

**"ముప్పూట నోగిరంబులు బదార్థములు**
**దప్పక కావళ్ళ నెప్పుడు బంప**
**వెండి వేశ్యల యిండ్ల నుండి భోగించు**
**మిండ జంగములు పంద్రెండు వేలనిన"**



వీరశైవంలో వద్యసేవనం, మాంసభక్షణం, వారవనితా సంగమం తప్పులేని అలవాట్లుగా ఉండేవి. బసవేశ్వరుడు **"కావళ్ళలో ముప్పూట ఓగిరములు పంపుతుండగా"** పన్నెండు వేలమంది మిండజంగములు వేశ్యల ఇళ్ళల్లో ఉండి భోగించేవారని బసవపురాణంలో ఉంది. జంగాలలో మిండజంగాలు వేశ్యాలోలురై వారి ఇళ్ళల్లోనే విహరించిన కారణంగా వీరిని మిండజంగములని పిలిచేవారు. **'బసవపురాణంలో పేర్కొనబడిన ఈ వేశ్యలు శైవదేవాలయాలలోని దేవదాసీలు. అప్పటికే శైవపూజారులకు శైవదేవాలయాల దేవదాసీలకు లైంగిక సంబంధం ఏర్పడి ఉండవచ్చు.'** (రామగోపాల్ రెడ్డి, యన్. ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ. 55)

***బసవపురాణం***లో మరొక కథ చూస్తే బసవేశ్వరుడు తనభార్య చీరను శివభక్తునికి ఇవ్వటం జరుగుతుంది. 'ఒక విటుడు వేశ్య ఇంటిలో ఉండి **"బసవేశ్వరుని యొద్దకేగి నిత్యము పడిని దెమ్ము"** అని తన సేవకుణ్ని పంపిస్తాడు.

బసవేశ్వరుని ఇంటికి వెళ్ళినపుడు బసవేశ్వరుని భార్య కట్టిన చీర చాలా మనోహరముగా ఉందని సేవకుడు వేశ్యతో అంటాడు. దాంతో ఆ చీర తనకు కావాలని విటుణ్ని వేశ్య కోరుతుంది. వేశ్య కోరిక తీర్చడానికి విటుడు బసవేశ్వరుణ్ని అడుగుతాడు. బసవేశ్వరుడు భక్తుని కోరిక తీర్చడానికి తన భార్యను చీర తీసి ఇవ్వమని అడుగుతాడు. భర్త ఆజ్ఞ మేరకు ఆమె ఆ చీర తీసివేయగానే మరొక చీర ఆమె ఒంటిమీదకు వస్తుంది. అదీ తీయగానే వేరొక చీర....అలా చీరలు ఒకదాని తర్వాత మరొకటి వస్తూనే ఉంటాయి. (ద్రౌపదీ వస్త్రాపహరణం లాగా) వాటిలో మోయగలిగినన్ని చీరలు తీసుకుని వెళ్ళి విటుడు వేశ్యకు ఇవ్వటం జరుగుతుంది'. (వేంకటరావు, నిడదవోలు. 1981: 12)

పండితారాధ్య చరిత్రలో వేశ్యాజీవనంలో భిన్నత్వం కనిపిస్తుంది. **"ప్రౌఢవతి అనే వేశ్య గురుభక్తాండారిని తిరస్కరించి, వేశ్యల పొందు వల్ల శీలభంగము, కళ్ళు కనిపించకపోవడం, వ్రతభంగం,**

**నవ్వులపాలు కావడం, మనసు తాపము, ధనహాని, ముక్తికి దూరం కావడం అనే ఏడువిధాల నష్టాలున్నాయని చెప్పింది."** (జ్యోతి, పి. 2006:1) ఈ విధమైన భిన్న మనస్తత్వం కలిగిన వేశ్యలు కూడా కనిపిస్తారు.

శైవయుగానంతరం సాహిత్యంలో శ్రీనాథుని వరకు దేవదాసీలు లేదా వేశ్యలు అంతగా కనబడరు. అక్కడక్కడ సానుల గూర్చి ప్రస్తావన వస్తుంది. 'శ్రీనాథుడు సానివాడను వర్ణిస్తూ రాసిన పద్యంలో

**"పదునాల్గు మహాయుగముల**
**ముదకగు భీమేశ్వరునకు మొగచాటైయుం**
**దదు సానిపెండ్లి యెప్పుడు**
**నది దక్షారామ మహిమ మగునోకాదో"**

ద్రాక్షారామ భీమేశ్వరునికి సానులనిచ్చి పెళ్ళి చేయడం జరుగుతుంది.' (పైదే. 63) దాతలు, తల్లిదండ్రులు యువతులను దేవాలయానికి దానమిచ్చి, దేవునితో పెళ్ళి జరిపిస్తున్నారు. శ్రీనాథుని కాలం (15వ శతాబ్దం) నాటికి కూడా ఇంకా అమ్మాయిల్ని దేవాలయాలకు దానమిచ్చి దేవదాసీలుగా లేదా సానులుగా చేస్తున్న విషయం తెలుస్తుంది.

ధూర్జటి ***శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము*** చతుర్థాశ్వాసంలో వేశ్యలున్నారు. వీరు మామూలు వేశ్యలు కారు. కాళహస్తీశ్వరున్ని దర్శించి తరించాలనే భక్తితాత్పర్యాలు గలవారు. మధురాపురిలోని మాణిక్యవల్లి అనే వేశ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరి వృత్తాంతం ఇందులో ఉంది. మాణిక్యవల్లికి డబ్బుసంపాదన అంటే మక్కువ ఎక్కువ. ధనముంటే శివునికి అఖిలోపచారములు చేయవచ్చునని ఆమె అభిప్రాయం. కాని ఈమె కుమార్తెలు మాత్రం దానికి విరుద్ధంగా కనిపిస్తారు. వీరికి శివభక్తి ఏర్పడడానికి కారణం **"జననాంతరవాసన"** అని ధూర్జటి పేర్కొనడం జరిగింది. ముందుజన్మలో వీరు తప్పక దేవదాసీలై ఉంటారు. ప్రస్తుత జన్మలో వేశ్య కడుపున పుట్టినా వీరికి గతజన్మ సంస్కారం వలన శైవభక్తి అబ్బి ఉంటుది. అలాగే శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము మొదటి ఆశ్వాసంలో శివుడు మాయా జంగముడై ఒక వేశ్య ఇంటికెళ్ళి ఆమెతో సుఖించే కథ ఒకటి ఉంది. ఈ దాసికి నారాయణవనం పాలకుడైన యాదవరాజు కొలువులో ఉద్యోగం ఉంది. ఆమెకు జంగములంటే సాక్షాత్తు శివుడు అన్నంత భక్తి ఉంది. శివుడు రాజభక్తిని పరీక్షించాలని మాయా జంగముడుగా వచ్చాడు. ఈ కథను బట్టి ఈ దాసి దేవదాసి అయివుండవచ్చు. దేవదాసీగా శివభక్తి, రాజభక్తి ఈమెలో ఉన్నాయి. దేవదాసీలు దేవాలయాలకే పరిమితం కాకుండా రాజాంత:పురాలలో కూడా పనిచేసే వారనడానికి ఈమె కథ నిదర్శనం. జంగముడు శివుడు అవతారమని నమ్మి ఆ దాసి అతనికి ఆతిథ్యమిచ్చింది. భక్తి పరవశమై తనను తాను సమర్పించుకున్నది. ఈ లక్షణం భక్తిలో పరాకాష్ఠ. ఒకప్పుడు దేవదాసీలు ఇలా కూడా ఉండేవారు.

అలాగే ధూర్జటి ***శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము*** లో వారవనిత అనేపదం కూడా కనిపిస్తుంది.

**'స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కుల కేలగల్గె నీ**
**యతులిత మాధురీ మహిమ....**

అని శ్రీకృష్ణదేవరాయల వారు ఇచ్చిన సమస్యను తెనాలి రామకృష్ణుడు పూరించిన విధానం చూస్తే ...

**... హా! తెలిసెన్ భువనైక మోహనో**
**ద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతాపహార సం**
**తత మధురాధరోదిత సుధారసధారల గ్రోలుటం జుమీ!"**

అని సమాధానం కనబడుతుంది. ఈ సందర్భంలో ఒకచిన్నకథను చెప్పుకోవచ్చు. తెనాలి రామకృష్ణుడు పై సమస్యను పూరించడానికి పక్షం రోజులు సమయం తీసుకుంటాడు. ఆ పక్షం రోజులు తెనాలి రామకృష్ణుడు ధూర్జటి ఇంటిముందు మారువేషంలో తిరుగుతూంటాడు. ధూర్జటి దినచర్యను ప్రతిరోజు గమనిస్తుంటాడు. "ధూర్జటి ప్రతినిత్యం పంచపంచ ఉష:కాలాన లేచి, కాలకృత్యాలను ముగించుకొని శివదీక్షకు కూర్చొని ఒకటొకటిగా స్తోత్ర నివేదన, భస్మస్నానం, భస్మధారణం, రుద్రాక్షధారణం, సంధ్యావందనం, లింగార్చనం, ఇష్టదేవతారాధనం, నైవేద్యం పూర్తికాగానే కొద్దిసేపు విశ్రమించి ఆ తర్వాత భోజనభాజనాదులు ముగించుకొని, ఆస్థాన ప్రవేశానికి ఆవశ్యకమైన తీరున పండిత వేషాన్ని ధరించి కొలువుకు వెళ్లి వస్తుండటం, ఇంటికి రాగానే మరుసటినాడు సభలో వినిపించవలసిన గ్రంథ భాగానికి సమాయత్తమవుతుండటం మూలాన రామకృష్ణుడికి పెద్దగా పనికి వచ్చే ఆచూకీలేవీ పొడచూపలేదు. పక్షాంతం కావచ్చే సమయానికి అన్నాళ్ళుగా పడుతున్న శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరై, రాజుగారికిచ్చిన మాట తప్పేట్లున్నదని భయపడుతున్న తరుణంలో రామకృష్ణుడు ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. ధూర్జటి కొలువు నుంచి తిరిగి రాగానే కొంతసేపు సేదతీరి, మునిమాపు వేళయేసరికి డాబు, దర్పం మీరిన భోగరాయ వేషాన్ని ధరించి, ఇంటినుంచి బైటపడి, పదేపదే అటూయిటూ చూసుకొంటూ – నాగవాసం దారి పట్టాడట. రామకృష్ణుడు ఆయనను అనుసరిస్తూ ఆయన ఇంటిలోకి వెళ్ళాక, బయట అరుగు మీద చేతిని తలక్రింద దిండుగా అమర్చుకొని రాత్రంతా అక్కడే తీరికగా విశ్రమించాడట. ధూర్జటి తెల్లవారుజామున తలుపు తెరుచుకొని బయటకి వచ్చి అరుగు మీదున్న రామకృష్ణుణ్ణి చూసి గుట్టు రట్టయిందని గ్రహించి, ఇక చేసేదేమీ లేక, దైవం మీద భారం వేసి ఇల్లు చేరుకొన్నాడట." (మురళీధరరావు, ఏల్చూరి. 2014:1) అదే రోజు రాయల సభకు వెళ్ళి రామకృష్ణుడు పైన చెప్పినవిధంగా సమస్యకు చమత్కార పూరణ చేశాడు. ఈ విషయం వలన ధూర్జటికవి వేశ్యాలోలుడు అని తెలుస్తుంది. అంతేగాకుండా ధూర్జటికవి మనుమడైన కుమార ధూర్జటి అభిప్రాయం ప్రకారం

"ధూర్జటి మహాకవి వేశ్యాలోలుడైనంత మాత్రమున అతని భక్తికిగాని, వాక్శుద్ధికి గాని, కీర్తికిగాని ఎట్టి భంగము కలుగదు. ఈ విషయమున మనము శ్రీనాథులను తార్కాణులుగా గ్రహింపవచ్చును. వేశ్యాస్నేహము సుకవులకు గుణాదాయకముగాని, దోషావహము కానేరదు. రక్తిపాకము పొందిన పిదపనే భక్తి. **'విషయాన నివర్తన్తే నిరాహారస్య దేహిన:'** అను భగవద్గీతోక్తి ననుసరించి 'కామిగాక మోక్ష కామి' యగుట యసంభవమనుట స్పష్టము" (రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ 1966: 5,6.) దీనినిబట్టి ఆరోజులలో వేశ్యలు లేదా వారకాంతలు రాజులకు, సంపన్నులకే కాక కవిపండితులకు కూడా లైంగికంగా ఉపయోగపడేవారని తెలుస్తుంది.


దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర ప్రథమభాగంలో విప్రనారాయణ చరిత్ర కలదు. ఇందులో కూడా వేశ్యల ప్రస్తావన కనిపిస్తుంది. శ్రీరంగ క్షేత్రమున విప్రనారాయణుడను వైష్ణవ బ్రహ్మచారి ఉండేవాడు. ఆ ఊరిలోనే దేవదేవి అనే వేశ్య కూడా కలదు. ఒకరోజు దేవదేవి విప్రనారాయణుని చూసి "ఈ వైష్ణవభక్తుని మత్పాదదాసునిగా జేసెదనని యామె ప్రతిన గైకొనెను. ఎట్లో వంచన చేసి, యా వీర వైష్ణవుని మనసు కరిగించి యాతని తన దాసునిగా దేవదేవి చేయగలిగెను. వలపు రెకెత్తినంతనే యా ఘోటక బ్రహ్మచారి, సానిదాని సొత్తు విడువలేక యామెతో గూడ సానివాడ కేగెను. దేవదేవి రాజగోపాలస్వామి సేవకురాలు. ఆమెయు నామె యక్కయు బూర్వ జన్మమున దివ్యాంగనలనియు 'ద్విజనందనునకు నిజనందన రసావేశంబు గల్పింప' శౌరియే వారిని వారాంగనలుగా పుడమిని సృజించెను" (రామనరసింహము, కాకర్ల. 1955: 115, 123, 124) దీనినిబట్టి దేవదేవి అనే వేశ్య రాజగోపాలస్వామి ఆలయములోని దేవదాసీ అయిఉండవచ్చు. లేదా నాట్యరూపంలో ఆస్వామిని కొలుస్తుండవచ్చు. దేవదాసీల పని కూడా నాట్యరూపంలో దేవుణ్ణి ఆరాధించడమే.

ప్రాచీన కావ్యాలలో పురవర్ణనలలో ఎక్కువగా వేశ్యావర్ణన కనిపిస్తుంది. క్రీడాభిరామం సీసపద్యంలో ఒక వేశ్య దేవాలయంలో దీపారాధన... మొదలైన పనులు చేస్తుంది. ఈ విషయాల్ని బట్టి కావ్యాలలోని వేశ్యలే దేవాలయాలలోని ఒకప్పటి దేవదాసీలు అని తెలుస్తుంది. అయితే కావ్యాలలో కనిపించే వేశ్యలంతా దేవదాసీలు కానవసరం లేదు. ప్రబంధాల కాలం నాటికి వేశ్యలకు ఒక కులం ఏర్పడింది. అదే వేశ్యాకులం లేదా భోగం కులం. ప్రబంధాలలో వేశ్యలకు సంబంధించిన వర్ణనలు అనేకం కనిపిస్తాయి. విజయనగర యుగసాహిత్యంలో కనిపించే వేశ్యలు ప్రాచీనకాలం నాటి దేవదాసీల వారసులుగా కనబడతారు. కాలక్రమేణా వీరిలో భక్తిభావం తగ్గిపోయింది. రాయల యుగంలో దేవాలయాలు ఉన్నాయి. ఉత్సవాలు, పూజాకార్యక్రమాలు మొదలైనవన్నీ జరిగేవి. వీటన్నింటిని చూసుకోవడానికి దాసీలుండేవారు. అయితే దేవాలయ దాసీలు



అంత:పురాలకు, అంత:పుర దాసీలు దేవాలయాలకు మారుతుండేవారు. వీరి కాలంలో చాలామంది నర్తకీమణులు తిరుపతి దేవస్థానానికి పంపబడినట్లు దేవస్థానంవారు ప్రకటించిన శాసనాన్ని బట్టి తెలుస్తుంది.

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలోని నాలుగాళ్ళ మంటపాలలో ఒకప్పుడు దేవదాసీలు నాట్యం చేసేవారు. క్రీ.శ.13వ శతాబ్దం నుండి దేవదాసీలు తిరుమలలో 'విలాసినీ' అనే నృత్యాన్ని ప్రదర్శించేవారు. ఈ విధంగా నృత్యాన్ని ప్రదర్శించే దేవదాసీలను విజయనగర రాజులు 'ఎంపెరు మానదీయర్ ' అని పిలిచేవారు. వీరినే తిరువీధుల సానులు అని కూడా పిలిచేవారు. సెవ్వసాని, శేష్పసాని, ఎక్కు, ఆమె కూతురు నాచ్చి, కుప్పసాని, తిప్పసాని, తిరువేంకట మాణిక్యం, లింగసాని మొదలైనవారంతా తిరుమల ఆలయంలో సేవలు చేశారు. మొదట దేవునిసేవకు మాత్రమే పరిమితమైన ఈ దేవదాసీలు తర్వాత దేవాలయాలపై పెత్తనం చేసే రాజుల సేవకు కూడా వినియోగింపబడ్డారు. రాజుల ముందు నాట్యం చేసి వారి మనసుకు ఆనందం కలిగించడం మాత్రమే కాకుండా శారీరకంగా కూడా దేవదాసీలు రాజులను సంతృప్తి పరచాల్సి వచ్చింది. తదనంతరం రాజు యొక్క పరివారానికి, అలాగే ఊరి పెద్దలకు, సంపన్నులకు అందరికీ... దేవదాసీలు సేవలు అందించాల్సి వచ్చింది. **'కళలకు, దేవుడి సేవకు మాత్రమే పరిమితమైన దేవదాసీలు పదమూడు, పద్నాలుగు శతాబ్దాల కాలానికి శరీరాన్ని అమ్ముకునే స్థాయికి వచ్చారు. ముస్లింల వల్ల రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. రాజ్యం, ప్రజల ఆర్థిక పరిస్థితి దిగజారింది. సమాజంలో విలువలు పడిపోయాయి. ముఖ్యంగా విజయనగర రాజుల పాలన మధ్యకాలం నుంచి వీరి సంప్రదాయ కళను పోషించే పాలకులు, ఆలయాలు, సమాజం లేకపోయింది. దేవదాసీలు పేదరికానికి బలై వీరి సంప్రదాయం దిగజారడంతో వీధిసానులుగా మారిపోయారు. వీరు గుడిసానులై, గుడిసేటిలై చిన్నచూపు చూడబడ్డారు. చివరకు వేశ్యలుగా పిలువబడుతున్నారు.'** (శ్రీనివాసులు రెడ్డి, పేట. 2014: 54)



### పాశ్చాత్యుల ప్రభావం

పాశ్చాత్యుల రాకతో మనసంస్కృతిలో విపరీతంగా మార్పులు వచ్చాయి. ఆంగ్లేయుల రాకతో దక్షిణభారత దేశ సంస్కృతిలో చాలా మార్పులు వచ్చాయి. ప్రజలలో దైవభక్తి తగ్గి హేతువాద దృష్టి వచ్చింది. దేవాలయ సంస్కృతి విచ్ఛిన్నమవుతూ వచ్చింది. అందులో భాగంగా దేవదాసీవ్యవస్థలో కూడా మార్పులు వచ్చాయి. దేవాలయాలలో పనిచేసే దాసీల సంఖ్య అంటే దేవదాసీల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. దీనికి గలకారణం ఆంగ్లప్రభుత్వం దేవదాసీల ఆస్తులను స్వాధీన పరచుకోవడం. కాలక్రమేణా దేవదాసీలకు జీవనభృతి కరువైంది. దీంతో జీవనభృతికోసం వీరు వేశ్య వృత్తిని చేపట్టారు. దేవదాసీ వేశ్యగా మారే కాలానికి తెలుగు సాహిత్యం ప్రారంభమయింది. అందుకే ప్రాచీన కావ్యాలలో దేవదాసీ అనేపదం కనిపించదు. వేశ్య అనే పదమే కావ్యాలలో వాడబడింది. ఈ కావ్యాలలో కనిపించే కొంతమంది వేశ్యలలో మొట్టమొదట దేవదాసీలుగా ఉండి ఆ తరువాత వేశ్యలుగా మారినవారు ఉండవచ్చు లేదా దేవదాసీ సంతతివారైనా కావచ్చు. ఎందుకంటే ఈ వేశ్యలలో దేవదాసీల స్వభావాలు కనిపిస్తాయి. అలాగే దేవదాసీలు నిర్వర్తించే విధులను వీరు కూడా నిర్వర్తిస్తుంటారు. ఉదాహరణకు వేశ్యలు దేవాలయాలో చేసే పనులు **"మహనీయ దేవ గంధర్వాప్సరో వేశ్యాజాతి... చామర వ్యంజన వీటికా కరండ పాదుకాముకుర దీపికా సంగీత నాట్యాద్యుపచార సేవా విశేషంబుల ప్రతి సంధ్యంబును బల్యంకికా సేవా బహిర్విజయాది భోగావసర సమయంబున సేవించుచుండుదురు"** అని వచనఖండంలో వేశ్యలు భీమనాధుని వింజామరలతో విసరడం, దీపాలు పెట్టడం, సంగీతనాట్యాది సేవలు చేయడం, పల్లకి మోయడం మొదలైన పనులు చేసినట్లు కనిపిస్తుంది. ఇవన్నీ దేవుని భోగావసరాలు కూడా అని ఈ వచనం పేర్కొంటున్నది. దీనినిబట్టి వేశ్యలు, భోగంవారు దేవదాసీలేనని తెలుస్తుంది. (రామగోపాల్ రెడ్డి, యన్. *ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ.* 61)

తెలుగు సాహిత్యంలోని వేశ్యలే ఒకప్పటి దేవదాసీలని అర్థమవుతుంది. అయితే కావ్యాలలో కనిపించే వేశ్యలంతా దేవదాసీలు కానవసరం లేదు. వేశ్యలకు వివాహ అర్హత రావడానికి గల కారణం ఆరోజులలో దేవదాసీలుగా సంఘంలో వారికుండిన గౌరవప్రదమైన గుర్తింపు. మధ్యయుగంలో దేవదాసీలను సంపన్నులు పెళ్ళి చేసుకునే పద్ధతి కూడా కనిపిస్తుంది. మధ్యయుగం వరకు ప్రధానంగా ఉన్న దేవదాసీ వ్యవస్థలో తదుపరి కొన్ని మార్పులు వచ్చి తెలుగు సాహిత్యం ప్రారంభం నాటికి దేవదాసీ వ్యవస్థ వేశ్యావ్యవస్థగా మారి రాను రాను చివరికి పతనస్థితికి చేరుకుంది.

### వ్యాస పరిమితి

దేవదాసీలు ప్రాచీన తెలుగుసాహిత్యంలో చాలావరకు వేశ్యలు గాను, వారకాంతలుగాను, సానులుగాను పిలువబడుతున్నారు. ఈ వ్యాసానికిగానూ పాల్కురికి సోమన *బసవపురాణం, పండితారాధ్య చరిత్ర,* శ్రీనాథుని *క్రీడాభిరామం, భీమేశ్వర పురాణం,* ధూర్జటి *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము (చతుర్థాశ్వాసం), దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర ప్రథమభాగం (విప్రనారాయణ చరిత్ర)* గ్రంథాలను మాత్రం అధ్యయనం చేసి అందులోని వేశ్యల, సానుల, వారకాంతల ప్రస్తావన వచ్చిన కొన్ని సందర్భాలను చర్చించడం జరిగింది.

### ఉపయుక్త గ్రంథసూచి

1. జ్యోతి, పి. సెప్టెంబర్, 2006. *పాల్కురికి సోమనాథుని సాహిత్యంలో వేశ్యావ్యవస్థ(వ్యాసం).* ఈమాట వెబ్మ్యాగజైన్.
2. మురళీధరరావు, ఏల్చూరి. జనవరి1, 2014. *స్తుతమతియైన యాంధ్రకవి వ్యాసం.* మాలిక పత్రిక.
3. రామగోపాల్ రెడ్డి, యన్. *ఆంధ్రశాసనాలు – సాహిత్యంలో ప్రతిఫలించే దేవదాసీ వ్యవస్థ.* (సిద్ధాంతగ్రంథం)
4. రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, వి. 1966. ధూర్జటి *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము (ప్రథమాశ్వాసం లఘుటీకా).* వావిళ్ళ ప్రెస్. మద్రాసు.
5. వెంకటరామ నరసింహము, కాకర్ల. 1955. *దక్షిణాంధ్రయుగ వాఙ్మయ చరిత్ర (ప్రథమభాగం).* యమ్. ఎస్. ఆర్. మూర్తి అండ్ కో. విశాఖపట్టణం.
6. వేంకటరావు, నిడదవోలు. 1981. *బసవపురాణం.* భ్రమరాంబా మల్లికార్జున దేవస్థానము. శ్రీశైలం.
7. శ్రీనివాసులు రెడ్డి, పేట. సెప్టెంబర్ 24, 2014. *తిరుపతి కథలు వ్యాసం (తిరుమల దేవదాసీలు).* నవ్యపత్రిక.
8. పాల్కురికి సోమనాథుడు – *బసవపురాణం, పండితారాధ్య చరిత్ర*
9. శ్రీనాథుడు – *క్రీడాభిరామం, భీమేశ్వరపురాణం*
10. ధూర్జటి – *శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము (చతుర్థాశ్వాసం).*